

రాజన్న సన్నిధిలో భక్తులు

వేములవాడ: వేములవాడ రాజన్నను శుక్రవారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల ద్వారా రూ.15 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



టీబీజీకేఎస్ ఆవిర్భావ వేడుకలు

సింగరేణి పరిధిలోని రామగుండం రీజియన్‌లో శుక్రవారం టీబీజీకేఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
31.0/14.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయి. చలితీవ్రత కొనసాగుతుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఎమ్మెల్యే సంజయ్‌ని సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న శ్రీమాన్

పెద్దపల్లిరూరల్: సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ పాలనలో బీసీ వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులపై కక్షసాధింపు చర్యలు పెరిగిపోయాయని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాడూరి శ్రీమాన్ ఆరోపించారు. జగిత్యాల మున్సిపల్ చైర్మన్ శ్రావణిని మానసికంగా కుంగిపోయేలా కక్షసాధింపు చర్యలకు పాల్పడిన ఎమ్మెల్యే సంజయ్‌ని బీఆర్ఎస్ పార్టీనుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ఉప్పల్ ఎమ్మెల్యే సుభాశ్ రెడ్డి అక్కడి కార్పొరేటర్ శ్రీదేవిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డాడని, పరకాల ఎమ్మెల్యే ధర్మారెడ్డి బీసీ రిజర్వేషన్లు రద్దుపరుస్తామంటూ బీసీ ప్రజానీకంపై మానసికదాడికి దిగారని శ్రీమాన్ ఆరోపించారు. దీనికి నిరసనగా సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడతామని అన్నారు. నాయకులు చంద్రశేఖర్, రఘు, సత్యం, చంద్రబాబు, శేఖర్, వినయ్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి జ్యోతి డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం కార్మిక సంక్షేమ బోర్డు కమిటీని నియమించకుండా నిధులు పక్కదారి పట్టిస్తోందని ఆరోపించారు. ఈ శ్రమ్ కార్డులను వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు మోటార్‌సైకిళ్లు అందించాలన్నారు. నష్టపరిహారం చెల్లింపు బకాయిలను విడుదల చేయాలన్నారు. నాయకులు మల్లేశ్, కనకయ్య, రాజేశం, మల్లయ్య, హనుమయ్య, శంకర్, రాజమల్లు, మోహన్‌రెడ్డి, భూమయ్య, శారద, తదితరులు ఉన్నారు.

కంటివెలుగుకు స్పందన



శిబిరాన్ని పరిశీలిస్తున్న సబీహ సుల్తానా

సుల్తానాబాద్: జిల్లావ్యాప్తంగా కంటి వెలుగు కార్యక్రమానికి విశేష స్పందన వస్తోందని ప్రోగ్రాం ప్రాజెక్ట్ ఆఫీసర్ సబీహ సుల్తానా అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని 2వవార్డులో నిర్వహిస్తున్న కంటివెలుగు పరీక్షల కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. జిల్లావ్యాప్తంగా 34కేంద్రాల్లో 4వేల మందికి శుక్రవారం పరీక్షలు చేసి, అవసరం అయినవారికి అద్దాలు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. డాక్టర్ శ్రీజ, హెచ్ఈవో శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో మానస, ఏఎన్ఎంలు సరస్వతీ, కవిత, రాజుభాయ్, రమాదేవి పాల్గొన్నారు.

జిల్లాలో 4,981 మందికి కంటి పరీక్షలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో శుక్రవారం కంటివెలుగు శిబిరాలలో 4,981 మందికి పరీక్షలు నిర్వహించినట్లు జిల్లావైద్యాధికారి ప్రమోద్‌కుమార్ తెలిపారు. అందులో 1,464మందికి లోపాలున్నట్లు గుర్తించి, 763 మందికి అప్పటికప్పుడే అద్దాలు అందించామన్నారు. మరో 701 మందికి అవసరమైన అద్దాలు ఆర్డర్ చేశామన్నారు. మెరుగైన వైద్యం కోసం 346 మందిని సిఫారసు చేసినట్లు వివరించారు.

గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

రామగుండం: తెలంగాణ రాష్ట్ర సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2023–24వ విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని జిల్లా సమన్వయ అధికారి ఏ.మంజుల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) రెగ్యులర్ ఇంటర్ ప్రాతిపదికన కళాశాలలో ప్రవేశాల నిమిత్తం అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ చేపడుతున్నామన్నారు. దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 31వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు చివరితేదీగా ప్రకటించారు. విద్యార్థులకు ప్రవేశపరీక్ష మార్చి 5వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని అన్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న అక్రమ వెంచర్ పెద్దపల్లి పట్టణ శివారులోనిది. జిల్లాకేంద్రం కావడం.. మున్సిపాలిటీని ఆనుకుని ఉండడంతో శివారు గ్రామాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇక్కడ కేవలం రెండింటికి మాత్రమే అనుమతి ఉన్నా.. పదుల సంఖ్యలో అక్రమ వెంచర్లు వెలిశాయి. మున్సిపాలిటీ పాలకవర్గంలోని మెజార్టీ సభ్యులే రియల్ వ్యాపారులు కావడంతో మున్సిపాలిటీకి చెల్లించాల్సిన గ్రీన్‌ల్యాండ్ 10 శాతం కేటాయించకుండానే వ్యాపారం చేసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితి జిల్లా అంతటా నెలకొంది.

ఓ సింగరేణి ఉద్యోగి పెద్దపల్లి శివారులో ఇటీవల అక్రమంగా వెలసిన వెంచర్‌లో గజాల చొప్పున ప్లాట్ కొన్నాడు. ఇందుకోసం కొంత అడ్వాన్స్ ఇచ్చి అగ్రిమెంట్ చేసుకున్నాడు. తరువాత రియల్ వ్యాపారులు రైతుబంధు వస్తుందంటూ అతడికి గుంటల చొప్పున తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. అయితే ప్రస్తుతం అతడు తాను కొనుగోలు చేసిన స్థలంలో ఇల్లు నిర్మించుకోవడానికి అనుమతులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు.

అక్రమ వెంచర్లు.. ఆగని అమ్మకాలు

ప్లాట్లు కొన్నవారికి తప్పని పాట్లు

- అనుమతులు లేకున్నా 'రియల్' వ్యాపారం
- గుంటల చొప్పున విక్రయిస్తూ మోసం
- ఆదాయం కోల్పోతున్న పంచాయతీలు, మున్సిపాలిటీలు



రంగంపల్లిలో వెలుస్తున్న వెంచర్లు



అక్రమ వెంచర్‌లో బోర్డు పాతిన సిబ్బంది(ఫైల్)

సాక్షి, పెద్దపల్లి: పంటలతో కళకళలాడాల్సిన వ్యవసాయ భూముల్లో ప్లాట్లు పండుతున్నాయి. చట్టంలోని లొసుగులతో మూడు వెంచర్లు.. ఆరు ప్లాట్లుగా జిల్లాలో రియల్ దందా కొనసాగుతోంది. నాలా కన్వర్షన్ చేసి లే అవుట్ అనుమతి వచ్చిన తరువాతే ప్లాట్లు పెట్టాలి. కానీ వ్యాపారులు ప్రైవేటు ఇంజినీర్లు, సర్వేయర్ల సహకారంతో హద్దురాళ్లు, సిమెంట్ స్తంభాలు పాతుతున్నారు. గజాల లెక్కన అమ్మాల్సిన ప్లాట్లను గుంటల చొప్పున ఫామ్ ల్యాండ్స్ పేరుతో విక్రయిస్తున్నారు. ప్లాట్లను విక్రయిస్తే పెద్ద మొత్తంలో కమీషన్ ఇస్తామంటూ కొందరు ఏజెంట్లకు ఆశ చూపుతున్నారు. వారు గ్రామాలు, పట్టణాల్లో తిరుగుతూ ప్రజలకు మాయమాటలు చెబుతూ స్థలాలను అంటగడుతున్నారు. ప్లాట్లు కొనుగోలు చేసిన తర్వాత వినియోగదారులు ఇబ్బందుల పాలవుతున్నారు. అనధికార వెంచర్లతో 10శాతం భూమి మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల పేరిట కేటాయించడం లేదు. దీంతో భవిష్యత్‌లో మరిన్ని కొత్త సమస్యలతోపాటు రిజిస్ట్రేషన్ శాఖకు ఆదాయం రావడం లేదు. గ్రామాల్లో వెలసిన వాటిలో 8 వెంచర్లు, రామగుండంలో 4, పెద్దపల్లిలో రెండింటికి మాత్రమే ప్రభుత్వం నుంచి అనుమతులు ఉన్నాయి. మిగిలిన మున్సిపాలిటీల్లో వెలిసిన వాటికి అనుమతులే లేవు. అయినా అమ్మకాలు జోరుగా సాగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిబంధనలు ఇలా..

ప్రభుత్వం 1965లో లేవుట్ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. 1972లో తుదిరూపు ఇచ్చింది. నిబంధనల ప్రకారం మున్సిపాలిటి పరిధిలో వ్యవసాయేతర భూములుగా మార్చుకున్న తర్వాతే లేఅవుట్ తయారు చేయాలి. సాగు భూములు వ్యవసాయేతర భూములుగా మార్చుకోవాలంటే నాలా (నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ అసెసెమెంట్) చట్టం ప్రకారం భూమి విలువలో 9శాతం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. అయితే రాష్ట్రం వచ్చాక తెలంగాణ ప్రభుత్వం మూడు శాతానికి తగ్గించింది. అయినా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆ పన్ను కూడా చెల్లించకుండానే వ్యాపారం చేస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. ప్లాట్ల సైజు, రహదారులు, మురుగు కాలువలు, విద్యుత్ లైన్, మంచినీటి సదుపాయం, పార్కులు, దేవాలయాల కోసం స్థలాన్ని కేటాయించాలి. మున్సిపాలిటీలతోపాటు గ్రామపంచాయతీలు ఈ నిబంధనల ప్రకారం లేవుట్ కోసం టౌన్‌ప్లానింగ్ డైరెక్టర్‌కు ప్రతిపాదనలు తయారుచేసి పంపించాలి. డైరెక్టర్ అనుమతి ఇస్తేనే లే అవుట్ ప్లాట్లుగా తయారుచేసుకోవాలి. 20గుంటలకు లోపు ఉంటే ఫామ్ ల్యాండ్స్ రిజిస్ట్రేషన్ చేయొద్దని మున్సిపల్ శాఖ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా ఈ తంతు ఆగడం లేదు.

అధికారుల ప్రేక్షక పాత్ర

కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా డీటీసీపీ జిల్లా కార్యాలయాన్ని ఏర్పాట చేశారు. జిల్లా టౌన్‌ప్లానింగ్ అధికారి పెద్దపల్లి, జగిత్యాలకు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. డీటీసీపీ కార్యాలయం ఏర్పాటు అయినా అదనపు పోస్టులు, సిబ్బంది లేరు. దీంతో పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలున్నాయి. రాజకీయ ఒత్తిళ్లతో అక్రమ వెంచర్లు వెలిసినా మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడం లేదు. అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోవద్దని, అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకుంటామని డీటీసీపీ అధికారి శ్రీనివాస్ వివరించారు.

భద్రత, రక్షణకే ప్రాధాన్యం

- రామగుండం సీపీగా బాధ్యతలు స్వీకరించిన ఐపీఎస్ రెమా రాజేశ్వరి



సీపీగా బాధ్యతలు స్వీకరించిన ఐపీఎస్ రెమా రాజేశ్వరి

సాక్షి, పెద్దపల్లి: ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను పరిష్కరిస్తూ, ప్రజల భద్రత, రక్షణకే ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతామని రామగుండం పోలీస్ కమిషనర్ రెమో రాజేశ్వరి తెలిపారు. రామగుండం సీపీగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సీపీ రాజేశ్వరి మాట్లాడుతూ.. చట్టపరిధిలో సామాన్యులకు న్యాయం చేసేలా కృషి చేస్తామని తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని ఏసీపీలతో సబ్ డివిజన్ పరిధిలో ఉన్నటువంటి భౌగోళిక పరిస్థితులను, ఎక్కువగా నమోదవుతున్న కేసుల వివరాలను అడిగి తెలుసుకోవడం జరిగిందని అన్నారు. సామాన్యులకు భరోసా కల్పించే విధంగా పోలీసింగ్ ఉంటుందని, శాంతి భద్రతల విషయంలోనూ కఠినంగా ఉంటామని, ఎవరైన శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదన్నారు. ఈ సందర్భంగా సీపీకి పలువురు పోలీసు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

జువాలజీ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జంతుశాస్త్రం (జువాలజీ) లెక్చరర్ పోస్టుకు ఈనెల 31 లోగా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ నితిన్ తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండి, ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 1న కాలేజీలో ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు.

బదిలీలు ప్రారంభం

- జిల్లాలో 34 ప్రధానోపాధ్యాయ పోస్టులు ఖాళీ
- స్పౌజ్ కేటగిరీలో 31మంది
- నేటి నుంచి 30వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు



పెద్దపల్లి ఎమ్మార్సీలో ధ్రువపత్రాల పరిశీలన

సాక్షి, పెద్దపల్లి: టీచర్లు దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న బదిలీ, పదోన్నతి ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న ఉపాధ్యాయుల సర్వీసు వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ బదిలీలు, పదోన్నతులకు అర్హులైనవారి జాబితాలను రూపొందించి శుక్రవారం సాయంత్రం నుంచి ఆన్‌లైన్‌లో ఉంచారు. ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న గెజిటెడ్ హెడ్మాస్టర్లు, ఎనిమిదేళ్ల పూర్తి చేసుకున్న అసిస్టెంట్లు, ఎస్జీటీలు బదిలీలకు అర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. బదిలీ కోరుకునేవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు నేటి నుంచి 30వ తేదీ వరకు అవకాశం కల్పించారు.

పూర్తయిన పరిశీలన

జిల్లాలో 357 ప్రాథమిక, 76 ప్రాథమికోన్నత, 105 ఉన్నత పాఠశాలల్లో 2,100మంది టీచర్లు పనిచేస్తున్నారు. ఇందులో 1,151 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరుకాగా, 165పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటికి సీనియార్టీ ప్రకారం 132మందికి పదోన్నతి పొందనున్నారు. అలాగే 103జీహెచ్ఎం పోస్టులకు గాను 34ఖాళీలుండగా వాటిని పదోన్నతులతో భర్తీచేయనున్నారు. అలాగే ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులు 43 భర్తీ కానున్నాయి. జిల్లావ్యాప్తంగా 1,058 ఎస్జీటీ పోస్టులుండగా 1,030మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.

2018 తరువాత పదోన్నతులు

2018 అనంతరం జరుగుతున్న పదోన్నతులు కావడంతో ఉపాధ్యాయులు ఆస్తకిగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలోని టీచర్ల వివరాలను ఇప్పటికే సేకరించిన విద్యాశాఖ పీజీ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు అర్హులైన ఉపాధ్యాయుల సర్వీసు పుస్తకాలు(ఎస్‌బీ), విద్యార్హత నిజ ధ్రువపత్రాల పరిశీలన పూర్తిచేశారు. దీంతో జిల్లా పరిధిలో ఖాళీల వివరాలను గుర్తించి, వీటిని శుక్రవారం సాయంత్రం జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌తో పాటు రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు సంబంధించిన సీనియార్టీ జాబితా సైతం అందుబాటులో ఉంచారు. అన్ని కేటగిరీల ఉపాధ్యాయులు వీటిని సరిచూసుకుని, అభ్యంతరాలు ఫిబ్రవరి 2లోగా తెలియాచేయాలని ప్రకటించారు.

నేటి నుంచి 30 వరకు

ఆయా కేటగిరీల వారీగా ఉన్న టీచర్లు బదిలీల కోసం శనివారం నుంచి తమ దరఖాస్తులను సమర్పించుకోవచ్చు. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా స్థానిక సంస్థ, ప్రభుత్వ పరిధిలోని పాఠశాలలు, వచ్చిన దర ఖాస్తులు, ఖాళీలు, మీడియం, కేటగిరీ ఆధారంగా కౌన్సిలింగ్ నిర్వహించి పోస్టులను కేటాయించనున్నారు.

స్పౌజ్ కేటగిరీ కింద జిల్లా నుంచి 31మంది

317 జీవో ద్వారా కొత్త జిల్లాకు కేటాయింపు విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించటంతో జిల్లాలో పనిచేస్తున్న 31మంది టీచర్లు ఇతర జిల్లాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. అలాగే ఇతర జిల్లాల నుంచి ఇద్దరు, ముగ్గురు వచ్చే అవకాశాలున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. లేదా పదోన్నతుల ద్వారా ఆయా ఖాళీలను భర్తీ చేయనున్నారు.

షెడ్యూల్ ఇలా..

దరఖాస్తుల స్వీకరణ(ఆన్‌లైన్‌లో): 28నుంచి 30వరకు
డీఈవోలకు హార్డ్‌కాపీల సమర్పణ: 30నుంచి ఫ్రిబవరి 02
హార్డ్‌కాపీల పరిశీలన: 03ఫిబ్రవరి–06 ఫిబ్రవరి
వెబ్‌సైట్‌లో పాయింట్ల నమోదు: 08 ఫిబ్రవరి
పాయింట్ల పై అభ్యంతరాలు, అప్పీలు: 10 ఫిబ్రవరి
తుదిజాబితా : 12ఫిబ్రవరి
జీహెచ్ఎంల బదిలీలు:13 ఫిబ్రవరి
పదోన్నతులు:14నుంచి 18వరకు
ఎస్ఏల బదిలీలు:21 ఫ్రిబవరి
ఎస్జీటీల బదిలీలు:మార్చి 03

అభ్యంతరాలు 2 లోగా తెలియజేయాలి

ప్రధానోపాధ్యాయులు గ్రేడ్–2, ఇతర కేటగిరీలకు చెందిన తాత్కాలిక సీనియారిటీ జాబితాను అధికార వెబ్‌సైట్‌లలో ఉంచాం. సీనియారిటీ జాబితాలో తేడాలు, అభ్యంతరాలు ఉన్నట్లయితే ఫిబ్రవరి 2లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు స్పెషల్ కేటగిరీలో ప్రమోషన్స్, ట్రాన్స్‌ఫర్‌కు దరఖాస్తు కోసుకోవాలంటే వారికి స్పెషల్ మెడికల్ బోర్డు, పెద్దపల్లిలో ఈ నెల 27 నుండి 30 వరకు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ అవకాశాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలి.

– డి.మాధవి, డీఈవో

టీచర్ల బదిలీ.. పదోన్నతులు సజావుగా జరపాలి

- విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి

పెద్దపల్లిరూరల్: ఉపాధ్యాయుల బదిలీ..పదోన్నతుల ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. మంత్రితో పాటు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, డైరెక్టర్ శ్రీదేవసేన, కార్పొరేషన్ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డితో కలిసి శుక్రవారం జిల్లా కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. టీచర్ల బదిలీ, పదోన్నతులు పారదర్శకంగా జరగాలన్నారు. జాబితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. జిల్లాలో మెడికల్‌బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మన ఊరు..మనబడి కార్యక్రమం కింద చేపట్టిన మోడల్‌స్కూల్ పనులు ఈనెలాఖరుకల్లా పూర్తి కావాలని ఆదేశించారు.



వీడియోకాన్ఫరెన్సులో కలెక్టర్, అధికారులు

ఉపాధి పనులే పెండింగ్: కలెక్టర్ సంగీత

జిల్లాలో మనఊరు మనబడి కార్యక్రమంలో 28పాఠశాలల పనులు చేపట్టామని, అందులో ఉపాధిహామీ పథకంకింద చేపట్టిన ఏడు మోడల్‌పాఠశాలల పనులే పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్ సంగీత తెలిపారు. మిగతా 21మోడల్‌స్కూళ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని వివరించారు. డీఈవో మాధవి, ఆర్అండ్‌బీ ఈఈ నర్సింహాచారి, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

సామాజిక భద్రత కల్పించడమే భవిష్యనిధి లక్ష్యం

జ్యోతినగర్: అసంఘటిత, సంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించడమే భవిష్యనిధి లక్ష్యమని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు సీనియర్ మేనేజర్ ఆశిష్‌కుమార్ పాండే అన్నారు. శుక్రవారం టెంపరరీ టౌన్‌షిప్‌లోని ఉద్యోగ వికాస కేంద్రం మిలీనియం హాలులో భవిష్యనిధిపై నోడల్ ఆఫీసర్ ఏనుగు మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని ఆయన మాట్లాడారు. భవిష్య నిధిలో చేరిన ప్రతి సభ్యుడికి జీవితకాలంలో ఎన్నో ప్రయోజనకరసేవలు అందుతాయన్నారు. అనంతరం కార్మికులకు లభించనున్న ప్రయోజనాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సెంట్రల్ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రీనివాసరావు, ఈఎస్ఐసీ బ్రాంచి మేనేజర్ ఖగేశ్వరరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి మోహన్‌రెడ్డి, నాగేంద్ర కుమార్, శ్రీధర్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఆశిష్ కుమార్ పాండే

వినతిపత్రం అందజేత

వేతనంపై పెన్షన్ చెల్లింపులు చేయాలని, 01.09.2014కు పూర్వం 58 సంవత్సరాలు నిండి పెన్షనర్లగా వెలురించిన తీర్పులో ఉటంకించడం సబబు కాదని ఎన్టీపీసీ రామగుండం సంస్థ మాజీ ఉద్యోగులు ఆశిష్‌కుమార్ పాండేకు వినతిపత్రం అందించారు. సత్తు ముత్యాలు, తిరుమల సురేందర్, లాలయ్య,పోచయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

బీ– థర్మల్ కేంద్రంలో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

రామగుండం: రామగుండంలోని 62.5 మెగావాట్ల సామర్థ్యం ఉన్న బీ–థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి నిలిచిపోయింది. ఇటీవల వార్షిక మరమ్మతులు పూర్తి చేసినప్పటికీ కాలం చెల్లిన విద్యుత్‌కేంద్రం కావడంతో తరుచూ సాంకేతిక సమస్యలు రావడంతో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలుగుతోంది. మంగళవారం విద్యుత్‌కేంద్రంలోని బాయిలర్ ట్యూబ్స్ లీక్ కావడంతో షట్‌డౌన్ అయింది. ఇంజినీర్లు బుధవారం పునరుద్ధరించి ప్రారంభించేందుకు సిద్ధమవుతున్న క్రమంలోనే టర్బయిన్‌లో సమస్యను గుర్తించారు. శుక్రవారం నాటికి కూడా సమస్య పరిష్కారం కాలేదు. కాగా టర్బయిన్‌లో వేడి చల్లారిన తర్వాత పునరుద్ధరణ పనులు ప్రారంభించనున్నట్లు విశ్వసనీయ సమాచారం.



బీ–థర్మల్ విద్యుత్ కేంద్రం

క్లుప్తంగా

జాతీయ అథ్లెటిక్ పోటీలకు ఎంపిక



ప్రశంసాపత్రం అందుకుంటున్న నరేశ్

రామగుండం: ఇటీవల మెదక్ జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో 9వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో రామగుండం రైల్వేస్టేషన్ ఏరియాకు చెందిన కె.నరేశ్ ప్రతిభ కనబరిచాడు. హైజంప్ 5కే వాక్‌లో వరుసగా రెండు మెడల్స్ (సిల్వర్, బ్రౌంజ్) సాధించాడు. కాగా ఫిబ్రవరిలో హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి, అథ్లెటిక్ అసోసియేషన్ ఆలిండియా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.లక్ష్మారెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి గెలుపొందిన క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

నియామకం



కొమురయ్య యాదవ్

పాలకుర్తి(రామగుండం): మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన వేల్పుగొండ కొమురయ్య యాదవ్‌ను యాదవ చైతన్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు గొర్ల అయిలేష్‌యాదవ్ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

హక్కుల సాధనలో టీబీజీకేఎస్ ఎనలేని కృషి



జెండా ఎగురవేస్తున్న మిర్యాల రాజిరెడ్డి



యూనియన్ జెండా ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్



జెండా ఆవిష్కరణలో శంకరయ్య తదితరులు

- ఘనంగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆవిర్భావ వేడుకలు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి కార్మికుల హక్కుల సాధనకు టీబీజీకేఎస్ ఎనలేని కృషి చేస్తుందని యూనియన్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ అన్నారు. యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆర్జీ–2 యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెండా ఆవిష్కరించి మాట్లాడారు. జాతీయ సంఘాలు పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలు తిరిగి కల్పించడం వరకు దాదాపు 80కి పైగా కొత్త హక్కులను సాధించుకున్నామన్నారు. కార్యక్రమంలో చెరుకు ప్రభాకర్‌రెడ్డి, సత్యం, బాణాకర్, దశరథంగౌడ్, రవీందర్, మల్లికార్జున్, అనిల్, చంద్రయ్య పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో..

గోదావరిఖని(రామగుండం): స్థానిక ప్రధాన చౌరస్తా సమీపంలోని టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, నాయకులు నూనె కొమురయ్య, కనకం శ్యాంసన్, గంద్ర దామోదర్, నాయిని మల్లేష్, వడ్డెపల్లి శంకర్, వెంకటేష్, పుట్ట రమేష్, మండ రమేష్, మల్లారెడ్డి, జనగాం శ్రీనివాస్, కెనడి, దాసరి నర్సయ్య, నారాయణ, దొరగండ్ల మల్లయ్య, సతీష్, మధు, సాయికుమార్, సుధాకర్, భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్జీ–3లో..

రామగిరి(మంథని): టీబీజీకేఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆర్జీ–3 పరిధి ఓసీపీ–1, 2, ఏపీఏ పరిధి ఏఎల్‌పీ గనులు, వివిధ డిపార్ట్‌మెంట్‌లలో, సెంటినరీకాలనీలోని టీబీజీకేఎస్ కార్యాలయ ఆవరణలో యూనియన్ జెండా ఆవిష్కరించి ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఏరియా ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య నాయకులు దాసరి మల్లేష్, వేముల రవిశంకర్, వేగోళపు మల్లయ్య, గండి శ్రీనివాస్, కొట్టె భీమయ్య, బర్ల సుధాకర్, చిప్ప సురేష్, వెంకటేశ్, దుగ్యాల నరేష్, గట్టు శ్రీనివాస్, క్రాంతి కుమార్, గోపి చందర్ తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్‌తోనే హక్కులు సాధ్యం



కార్మికుడికి కేక్ తినిపిస్తున్న మల్లయ్య

గోదావరిఖని(రామగుండం): కార్మికుల హక్కులు సాధించిపెట్టడం టీబీజీకేఎస్‌తోనే సాధ్యమని యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఆర్జీ–1 ఏరియా జీడీకే–2వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. 20 ఏళ్లు పూర్తి చేసుకున్న యూనియన్ కార్మికులకు ఎన్నో హక్కులు సాధించి పెట్టిందన్నారు. జాతీయ కార్మిక సంఘాలకు దీటుగా యాజమాన్యంతో పోరాటం చేస్తోందన్నారు. జాతీయ సంఘాలు పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలు సాధించి సింగరేణిలో కార్మికులకు అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో నాయకులు దాసరి నర్సయ్య, దూట శేషగిరి, దొరగండ్ల మల్లయ్య, మధుబాబు, అయాజ్, వెంకటేష్, రవి, తిరుపతి, వెంకటరామిరెడ్డి, రహీం, సతీష్, జలపతి, సాయి, ప్రభాకర్, శ్రీనివాస్, రాజు, సురేష్, మోహన్, రాజకుమార్, జియా తదితరులు పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలకు స్వచ్ఛమైన తాగునీరందించాలి



ధర్నాలో మాట్లాడుతున్న సత్తయ్య

గోదావరిఖని(రామగుండం): సింగరేణి కార్మిక కుటుంబాలకు స్వచ్ఛమైన తాగునీరందించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్జీ–1 జీఎం కార్యాలయం ఎదుట మహాధర్నా కార్యక్రమం నిర్వహించారు. సింగరేణి కార్మికులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని గత రెండేళ్ల నుంచి ఆందోళన, నిరసన, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించినా యాజమాన్యం తీరులో మార్పురాలేదన్నారు. యుద్ధ ప్రతిపాదికన రాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ రేషన్ వాటర్ ప్లాంట్‌ను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వై.సారంగపాణి, ఆకుల హరిణ్, సాయవేణి సతీష్, వడ్డేపల్లి కుమార్, అరుకాల ప్రసాద్, మాదాసు రవీందర్, గాజుల వెంకటస్వామి, మంచినీళ్ల స్వామి, తాట్ల లక్ష్మయ్య, పల్లె శ్రీనివాస్, పోతరబోయిన విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- రామగుండం ఎమ్మెల్యే చందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం ప్రాజెక్టు లేబర్ గేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రానున్న అసెంబ్లీ సమావేశంలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానన్నారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం అనుసరిస్తున్న ధోరణి సరికాదన్నారు. ఎలక్ట్రానిక్ పంచింగ్ సిస్టం ప్రవేశపెట్టడం, కార్మికులు ఎదుర్కొంటున్న చిన్నచిన్న రుగ్మతలకే మెడికల్ అన్‌ఫిట్ చేయడం మానుకోవాలన్నారు. 2019లో కాంట్రాక్టు కార్మికులకు మెరుగైన వేతనాల పెంపుదల కోసం కృషి చేయడం జరిగిందన్నారు. కొత్త వేతన ఒప్పందంపై కార్మిక సంఘాల జేఏసీతో కలిసి కొత్త అగ్రిమెంట్ కోసం యాజమాన్యాన్ని పలుమార్లు కలిసినా స్పందన కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో నాలుగైదు రోజుల్లో కార్మికులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, జిల్లా మల్టిపుల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకుడు ఇజ్జగిరి భూమయ్య, అంతర్గాం జెడ్పీటీసీ అముల నారాయణ, కార్పొరేటర్లు ఎన్వీ రమణారెడ్డి, కల్వచర్ల కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం తప్పదు

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్



నిర్వాసితులతో మక్కాన్‌సింగ్

రామగుండం: మేడిపల్లి ఓపెన్‌కాస్టు నిర్వాసితుల సమస్యలు వెంటనే పరిష్కరించకుంటే ఉద్యమం తప్పదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ స్పష్టం చేశారు. ఈ మేరకు భూములను త్యాగం చేసిన పాములపేట, లింగాపూర్ దళితులతో శుక్రవారం సమావేశమయ్యారు. ముందుగా రెండు గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మక్కాన్‌సింగ్ సింగరేణి జీఎంతో ఫోన్‌లో మాట్లాడి నిర్దేశిత గడువులోగా నిర్వాసితుల సమస్యలు పరిష్కారించాలని కోరగా జీఎం సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. సింగరేణికి అప్పగించిన భూములతోనే బాధిత నిర్వాసితులు ఉపాధి పొందేవారని, ప్రస్తుతం గుంట భూమి కూడా లేక సాగుకు దూరమై కుటుంబాలు కూలీ పనులకు వెళ్లాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ సీనియర్ నేత ఠాకూర్ అయోధ్యసింగ్, డివిజన్ ప్రతినిధులు ఈదునూరి హరిప్రసాద్, సిరిశెట్టి సతీష్‌గౌడ్, పల్లికొండ రాజేష్, సింగం కిరణ్‌కుమార్‌గౌడ్, ఎండీ.యూసుఫ్, యాసిన్, నిర్వాసితులు కుడుక సత్తయ్య, భూమయ్య, కూకట్ల శ్రీనివాస్, రాములు, కండె ప్రభాకర్ తదితరులున్నారు.

శ్రమ దోపిడీకి గురవుతున్న రైల్వే కాంట్రాక్టు కార్మికులు

రామగుండం: రైల్వే కాంట్రాక్టు కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో వారి పరిస్థితి అధ్వానంగా మారిందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ఠాకూర్ అన్నారు. శుక్రవారం స్థానిక రైల్వేస్టేషన్ ఏరియాలోని రెగ్యులర్ ఓవర్‌హాలింగ్ షెడ్డు (ఆర్ఓహెచ్)ను సందర్శించగా, కార్మికులు తమ బాధలను ఠాకూర్ కు ఏకరువు పెట్టుకున్నారు. ఈసందర్భంగా ఠాకూర్ మాట్లాడుతూ, కార్మికులకు పే స్కేల్, ఈఎస్ఐ, హెల్త్‌కార్డ్స్ ఏమీ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. కఠినమైన విధులు నిర్వహిస్తున్న కార్మికులకు సకాలంలో కాంట్రాక్టరు వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురవుతున్న విషయాన్ని తెలిపారు. దీనిపై స్పందించిన మక్కాన్‌సింగ్ కాంట్రాక్టు కార్మికుల పక్షాన చేసే పోరాటానికి కార్మిక లోకం కదిలిరావాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ ప్రతినిధులు ఈదునూరి హరిప్రసాద్, తాజ్, జగన్‌మోహన్‌రావు, గౌస్‌బాబా, సిరిశెట్టి సతీష్, చాంద్‌పాషా, పల్లికొండ రాజేష్, ప్రేమ్ తదితరులున్నారు.

అప్రమత్తంగా విధులు నిర్వహించాలి



సూచనలిస్తున్న హనుమంతరావు

రామగిరి(మంథని): సింగరేణి భద్రత సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని చీఫ్ ఆఫ్ సెక్యూరిటీ బి.హనుమంతరావు సూచించారు. ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–1, 2లను శుక్రవారం సందర్శించి మాట్లాడారు. డీజిల్ బంక్, స్క్రాప్ యార్డ్స్, స్టోర్స్‌లతోపాటు పలు చెక్ పోస్టుల రికార్డులను పరిశీలించారు. అనంతరం ఓసీపీ–1 అధికారి రాధాకృష్ణతో ప్రత్యేక సమావేశం నిర్వహించి దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించారు. చెక్ పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్న భద్రత సిబ్బంది రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో డీజీఎం స్టోర్స్ ఉదయ భాస్కర్, సీనియర్ సెక్యూరిటీ అధికారి లక్ష్మీనారాయణ, జూనియర్ ఇన్‌స్పెక్టర్ పి.రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతం



తాపీమేస్త్రీలకు ఉచిత బీమా బాండ్లను అందిస్తున్న భారతి సంస్థ ప్రతినిధులు

మంథని: మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని భారతి సిమెంట్ సంస్థ మేనేజర్ నాగేశ్వర్‌రావు, టెక్నికల్ ఇంజినీర్ సాగర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మంథనిలోని శివసాయి ఐరన్, హార్డ్‌వేర్ దుకాణంలో తాపీమేస్త్రీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసిందన్నారు. అల్ట్రాఫాస్ట్‌తో ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, వంతెనలు, రహదారులకు సరైన ఎంపిక అన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందిస్తామని చెప్పారు. నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్ వద్దకు వచ్చి సహాయపడుతారన్నారు. ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫస్ట్ బలంగా ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా 120 మంది తాపీమేస్త్రీలకు ఉచితంగా రూ.లక్ష ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో డీలర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న బాధితులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం టీటీఎస్‌లోని ఓ స్కూల్ ఎదుట బాధితులు నిరసన చేపట్టారు. శుక్రవారం రాత్రి టౌన్‌షిప్‌లోని స్కూల్ ముందు గోదావరిఖని ఇందిరానగర్‌కు చెందిన పలువురు కరాటే కోచ్ మనోజ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని అనడంతో పాటు స్కూల్‌లో అడ్మిషన్ల కోసం, అప్పుగా మొత్తంగా అతడికి డబ్బులు ఇచ్చామని తిరిగి ఇవ్వకుండా తప్పించుకుని తిరుగుతున్నాడని బాధితులు ఆరోపిస్తున్నారు. స్కూల్‌లో మనోజ్ ఉన్నాడనే సమాచారంతో బాధితులు పెట్రోల్ బాటిల్స్‌తో నిరసన చేపట్టారు. మనోజ్ 100 డయల్‌కు కాల్ చేయడంతో పోలీసులు అతడిని స్టేషన్‌కు తీసుకురాగా ఇరు వర్గాలు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో తిరిగి బాధితులు స్కూల్‌లో పెట్రోల్ బాటిల్స్‌ను పట్టుకుని నిరసన చేపట్టారు. ఎన్టీపీసీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

సింగరేణిలో విపరీతంగా పెరిగిన రాజకీయ జోక్యం



తోట వేణు, ఉపాధ్యక్షుడు

గోదావరిఖని(రామగుండం): సింగరేణిలో విపరీతంగా పెరిగిన రాజకీయ జోక్యం మూలంగా సంస్థ ఆర్థిక పరిస్థితి అధ్వానంగా మారిందని హెచ్ఎంఎస్ అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్ విమర్శించారు. శుక్రవారం రామగుండం రీజియన్ నూతన కమిటీని ప్రకటించారు. కమిటీ రీజియన్ ఉపాధ్యక్షుడిగా తోట వేణును నియమించినట్లు తెలిపారు. కార్యదర్శిగా బండారి రాజలింగు, కార్యవర్గాన్ని ప్రకటించారు. రాబోయే రోజుల్లో యూనియన్ బలోపేతమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు. జాయింట్ సెక్రెటరీగా సత్యనారాయణ, తుడి రామస్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఆరె మల్లేష్, రంగు అంజి, సంగి రవి నియమించారు.

బాధితులకు న్యాయం చేయాలి



కార్యక్రమంలో నాయకులు

గోదావరిఖని(రామగుండం): ఆర్ఎఫ్‌సీఎల్ ఆస్తులు జప్తు చేసైనా ఉద్యోగ బాధితులకు న్యాయం చేయాలని ఏఐవైఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. శుక్రవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆర్ఎఫ్‌సీఎల్ అమరుడు ముంజ హరీష్ ఫ్లెక్సీకి వినతి పత్రం అందజేశారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉద్యోగాలు పెట్టిస్తామని నిరుద్యోగ యువకులను మోసగించి పలువురి అండతో దళారులు రూ.కోట్లు వసూలు చేసి నిరుద్యోగుల జీవితాలను రావణ కాష్టంగా మార్చారన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ దళారులపై సీబీసీఐడీ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నెల రోజుల్లో బాధితులందరికీ డబ్బులు చెల్లించని పక్షంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు ఆమరణ దీక్ష చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సాదుల శివకుమార్, ఆసాల నవీన్, శనిగరపు చంద్రశేఖర్, రానవేణి సుధీర్, కోడం సునీల్, భూసారపు రాజు, పునీంద్ర, కరీం పాల్గొన్నారు.

ఆగిన లారీని ఢీకొని వృద్ధుడు మృతి

కరీంనగర్‌రూరల్: వృద్ధుడు స్కూటీపై వెళ్తూ ఆగి ఉన్న లారీని వెనకనుంచి ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన సుంకే భూమయ్య(70) చిన్న కుమారుడు మహేశ్ నెలరోజుల నుంచి చల్మెడ ఆనందరావు క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రోజూ భూమయ్య ఆస్పత్రికి వెళ్లి కుమారుడికి ఆహారం ఇచ్చి వస్తున్నాడు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ఆస్పత్రి నుంచి స్కూటీపై బయల్దేరిన భూమయ్య బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద రోడ్డులో నిలిపి ఉన్న లారీని వెనుకనుంచి ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య భూలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ..

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు చెందిన పద్మ ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనంపై నుంచి కింద పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. రూరల్ పోలీసుల కథనం.. సుల్తానాబాద్‌కు చెందిన ఎనగంటి శంకరయ్య–పద్మ దంపతులు కరీంనగర్‌లోని కమల్ సెలక్షన్స్‌లో పనిచేస్తారు. రోజూ ఉదయం స్కూటీపై ఇద్దరు కరీంనగర్‌కు వచ్చి మళ్లీ సుల్తానాబాద్‌కు రాత్రి వెళ్తారు. ఈ క్రమంలో గురువారం కరీంనగర్‌కు వస్తున్న క్రమంలో బొమ్మకల్ ఫ్లైఓవర్ సమీపంలో ప్రమాదవశాత్తు పద్మ స్కూటీ పైనుంచి కిందపడింది. గాయపడిన పద్మను చల్మెడ ఆనందరావు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం వేకువజామున మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి..



గుర్తుతెలియని మృతదేహం

మల్యాల: మండలంలోని ముత్యంపేట కొండగట్టులో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. కొండగట్టు వద్ద గుర్తు తెలియని వ్యక్తిని టాటాఏస్ వాహనం ఢీకొన్న ఘటనలో అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి వయసు సుమారు 40–45 ఏళ్లు ఉంటాయని, ఎవరైనా గుర్తుపడితే మల్యాల ఎస్సై 94407 95284, సీఐ రమణమూర్తి 9440619333 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.

మైతాపూర్‌లో వ్యక్తి ఆత్మహత్య

రాయికల్: మండలంలోని మైతాపూర్‌కు చెందిన మర్రిపల్లి బాజయ్య (53) జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. బాజయ్య కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడని జీవితంపై విరక్తి చెంది గ్రామశివారులోని ఓ మామిడితోటలో లుంగీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడి తల్లి చిన్నక్క ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.

ఉరేసుకుని వృద్ధురాలు...

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన దయ్యాల బుచ్చమ్మ (80) వృద్ధురాలు గురువారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోచమ్మవాడకు చెందిన బుచ్చమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు పలు ఆస్పత్రుల్లో చూపించినా ఆరోగ్యం నయం కాకపోవడంతో మనస్థాపానికి గురైన బుచ్చమ్మ గురువారం రాత్రి తన ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుమార్తె చెట్టె రాజు ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు పట్టణ సీఐ కిశోర్ తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలోపడి వృద్ధురాలు మృతి

ఇల్లందకుంట(హుజూరాబాద్): మండల కేంద్రానికి చెందిన మంకు కొమురమ్మ (70) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందింది. పోలీసుల వివరాలు.. గురువారం రాత్రి కొమురమ్మ బహిర్భూమికి వెళ్లేందుకు ఇంటి ముందు ఉన్న చేదబావిలో నీళ్లు తోడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మృతిచెందింది. మృతురాలి కుమారుడు మంకు సంపత్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు.

విద్యుత్‌షాక్‌తో వ్యాపారి..

వేములవాడఅర్బన్: పట్టణానికి చెందిన వస్త్రవ్యాపారి ఆడెపు గంగాధర్(45) ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై శుక్రవారం మృతిచెందాడు. తన షాపు లోని బోర్డును మార్చే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌తీగలు తగిలి అక్కడికక్కడే కుప్పకూలాడు. హుటాహుటిన స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడు 20ఏళ్లుగా వస్త్ర వ్యాపారం చేస్తున్నాడు. గంగాధర్ మృతి పై వ్యాపారులు వేముల శ్రీనివాస్, కొమ్మ నటరాజ్, వేముల విష్ణు, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్ సంతాపం తెలిపారు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

మానేరు వెలస్కో-23 పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ తదితరులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల ఆధ్వర్యంలో పద్మనగర్‌లోని మానేరు సెంట్రల్ స్కూల్‌లో వెలస్కో- 2023 పేరిట నిర్వహించే 37వ వార్షికోత్సవానికి సంబంధించి వాల్ పోస్టర్‌ను శుక్రవారం కరీంనగర్ జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్ జనార్దన్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత మూడేళ్లుగా విద్యార్థులు వార్షికోత్సవాలకు దూరంగా ఉన్నారని ఈ సంవత్సరం అన్ని విద్యాసంస్థలు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మానేరు స్కూల్ విద్యార్థులు తమ మేధస్సుకు పదునుపెట్టి సమాజానికి ఉపయోగపడే వినూత్న ప్రదర్శనలు చేయడం అభినందనీయమన్నారు. విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ, ఈ నెల 28, 29 తేదీల్లో వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ కడారి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో కరోనా లాంటి వైరస్‌లను భవిష్యత్‌లో ఎలా ఎదుర్కోవాలో తదితరవాటిని ప్రదర్శించనున్నట్లు తెలిపారు. 28న జరిగే కార్యక్రమానికి కలెక్టర్ ఆర్వీ కర్ణన్, 29న జరిగే కార్యక్రమానికి శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ సీహెచ్.మల్లేశం హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి అశోక్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, మానేరు బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.